నమస్తే తెలంగాణ

# జనగామ

5 | వరంగల్, మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | JANAGAON




రామానుజపురంలో వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

## ఉప్పొంగిన అభిమానం

- ఎమ్మెల్సీ కవితకు అడుగడుగునా జన నీరాజనం
- మంగళ హారతులు పట్టి.. పూల చల్లి ఘన స్వాగతాలు.. ఆశీర్వాదాలు
- సమస్యలను చెప్పుకొన్న ప్రజలు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 24 : ఎమ్మెల్సీ కవితకు జనం నీరాజనం పట్టారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆమెకు అడుగడుగునా అభిమానులు ఘన స్వాగతం పలికారు. స్థానిక మహిళలు మంగళహారతులు పట్టి ఆశీర్వదించారు. బీఆర్ఎస్ నాయకులు పూలతో సాదరంగా ఆహ్వానించగా జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి మార్కెట్ యార్డు వరకు ప్రజలు రోడ్డుపై స్వాగతం పలికేందుకు తరలివచ్చారు. దారి వెంబడి అనేక మంది మహిళలు, ప్రజలు తాగునీరు, సాగునీరు వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, కేసీఆర్ పాలనలో ఎప్పుడూ నీటి సమస్య రాలేదని చెప్పుకొన్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మెల్సీ కవితను కోరారు.



సతీశ్ జిరాక్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ ఎంపీ కవిత

## ఉద్యమకారులకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలం

వారికి ఎంత చేసినా తక్కువే

- ఎక్కడ ఆపదొచ్చినా మేం ఆదుకుంటాం
- దివ్యాంగుడు సతీశ్ జిరాక్స్ సెంటర్ ప్రారంభోత్సవంలో కవిత

దంతాలపల్లి, ఫిబ్రవరి 24 : తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందున్న ఉద్యమకారుల కుటుంబాలకు ఎంతచేసినా తక్కువేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. దంతాలపల్లి మండలం రామానుజపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు చిర్ర లింగన్న కుమారుడు, దివ్యాంగుడు సతీశ్ సోషల్ మీడియాలో తనకు ఉపాధి కల్పించాలని కోరడంతో స్పందించిన కవిత వెంటనే అతడికి ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్ కోసం కంప్యూటర్, జిరాక్స్ మిషన్, ప్రింటర్‌ను సమకూర్చి సోమవారం ఆమే స్వయంగా ప్రారంభించారు. కాగా తొలిసారి మండలానికి వచ్చిన కవితకు బీఆర్ఎస్ శ్రేణులు, మహిళలు పూల వర్షం కురిపిస్తూ మంగళహారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. తెలంగాణ కోసం 2001లో కేసీఆర్ గులాబీ జెండా ఎగురవేసిన నాటి నుంచి నేటి వరకు ఆయనతో ఉద్యమంలో పాల్గొని రాష్ట్రం తీసుకరావడంలో అందరి పాత్ర ఉన్నదన్నారు. స్ఫూర్తిప్రదాతగా, మార్గదర్శిగా కేసీఆర్ ముందుకు నడిపిస్తే వెనుక నడిచిన ఉద్యమకారుల వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిందన్నారు. మన నీళ్లు, నిధులు మనకు వచ్చాయన్నారు. బీఆర్ఎస్ చిన్న కుటుంబం కాదని పెద్ద కుటుంబమని మన కార్యకర్త కుటుంబానికి ఆపదొస్తే తలా ఒక చేయి వేస్తే అందరం బాగుపడే అవకాశం ఉంటుందనే ఇక్కడకి వచ్చినట్లు కవిత చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలోని దివ్యాంగులు, వృద్ధులు తమకు ఉపాధి కల్పించాలని వినతిపత్రాలు అందించారు. ఇక్కడ జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వొలాద్రి ఉమా మల్లారెడ్డి, యువ నాయకుడు రవిచంద్ర, మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, నాయకులు కిశోర్‌కుమార్, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాములు, లింగన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రచారం బంద్

- ఈ నెల 27 సాయంత్రం వరకు మద్యం దుకాణాలు సైతం
- బల్క్ ఎస్సెమ్మెస్‌లు నిషేధం.. 144 సెక్షన్ అమలు
- మార్గదర్శకాలు పాటించాలని కలెక్టర్ ఆదేశం



నల్లగొండ, ఫిబ్రవరి 24: వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ ఎన్నికల నేపథ్యంలో నేటి నుంచి జిల్లాల్లో ఎన్నికల కోడ్ సందర్భంగా 144 సెక్షన్ అమలు కానున్నది. దీంతో నేడు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఈ నెల 27 సాయంత్రం వరకు సైలెన్స్ మోడ్ ఉంటుందని, ఈ 48గంటల పాటు ఆయా జిల్లాల్లో మద్యం దుకాణాలు బంద్ చేయడంతో పాటు ప్రచారం నిషేధించాలని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. బల్క్ ఎస్ఎంఎస్‌లు సైతం నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఈ సైలెన్స్ పీరియడ్‌లో జిల్లా వ్యాప్తంగా ఎవరైనా రాజకీయ సమావేశాలు, ప్రచారాలు చేయవద్దని, సోషల్ మీడియాలో సందేశాలు నిలిపివేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్యం చట్టం 1951, ఎన్నికల నియమావళి 1961 ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర జిల్లాలకు చెందిన వారు ఉండవద్దని, వచ్చే నెల 3న నల్లగొండ మున్సిపాలిటీలో మద్యం దుకాణాలు బంద్ చేయాలని ఆదేశించారు.

## పర్యటన విజయవంతం

ఎమ్మెల్సీ కవిత మానుకోట జిల్లా పర్యటన విజయవంతంగా ముగిసింది. ఉదయం 10గంటలకు దంతాలపల్లి మండలం రామానుజపురం గ్రామానికి చేరుకున్న ఆమె దివ్యాంగుడైన సతీశ్ 'కేసీఆర్ ఇంటర్నెట్ అండ్ జిరాక్స్ సెంటర్'ను ప్రారంభించారు. అక్కడినుంచి మరిపెడ మండలం చిల్లంచర్లంలో జాగృతి నాయకురాలు మాధవి ఇంటికి వెళ్లి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం కురవి వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుంచి జిల్లాకేంద్రానికి చేరుకున్న కవితకు పూలే విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆదే జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్కడి నుంచి కేసముద్రం మండలం అన్నారం గ్రామానికి వెళ్లి గాయకుడు మానుకోట ప్రసాద్ ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి కేసముద్రం మార్కెట్ యార్డ్‌కు వెళ్లి అక్కడ మిర్చి రైతులతో మాట్లాడారు. పంటకయ్యే పెట్టుబడి, దిగుబడి ఎంత తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యులు రవిచంద్ర, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, బీఆర్ఎస్ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో ఎమ్మెల్సీ కవితకు గజమాలతో ఘన స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



# రైతుల గోస పట్టదా?

- మానుకోట అభివృద్ధి ఎందుకు ఆగింది..
- జిల్లాకు కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏది?
- సీతారాంతండాను ఎందుకు ఆదుకోలేదు
- ఎమ్మెల్సీ కవిత

మహబూబాబాద్, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ) : ఒక రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న మానుకోట ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేసి ఎంతో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో చేసిందేమీ లేదని ఆమె విమర్శించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మానుకోటలో ఒక మున్సిపాలిటీ ఉంటే అదనంగా మూడు మున్సిపాలిటీలు చేసి ఒక్కో మున్సిపాలిటీకి రూ.25 కోట్ల చొప్పున ఇచ్చి అభివృద్ధి చేశారని, కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా కేసీఆర్ ఇచ్చిన నిధులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. జిల్లాలో చాలా పనులు 90శాతం పూర్తయ్యాయని, కేవలం 10శాతం కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తే మొత్తం పనులు పూర్తయితాయని తెలిపారు. కానీ నిధులు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టిందని ఆరోపించారు. జిల్లాలో రైతులకు రుణమాఫీ కాక.. రైతు భరోసా అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని కొంతమంది రైతులకు చనిపోయిన తర్వాత వచ్చే రైతు బీమా డబ్బులు కూడా అందడం లేదని మండిపడ్డారు. మానుకోట గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతమని అందరూ వ్యవసాయాన్నే నమ్ముకొని బతుకుతారని వారిపై రేవంత్ సర్కారుకు కనీస కనికరం లేకుండా పోయిందన్నారు. మిర్చి, పసుపు రైతుల కన్నీళ్లు ప్రభుత్వానికి కనిపించడం లేదా అన్ని ప్రశ్నించారు. రైతులను మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి అసలు మనసు ఎలా వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి పోయి కేంద్ర మంత్రి, అధికారులతో భేటీ అయి మిర్చికి మద్దతు ధర తీసుకొచ్చాడని, అదే తరహాలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా తేవాలని ఆమె డిమాండ్ చేశారు. తొర్రూరు, మరిపెడలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు అతీగతీ లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పనులే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఒక ఇటుక రాయి కూడా వేయలేదన్నారు.గతేడాది ఆగస్టు నెలలో భారీ వర్షాలకు పంటలు కొట్టుకుపోయి, ఇసుక మేటలు వేసి రైతుల చాలా నష్టపోయారని.. తెగిపోయిన చెరువులు, కొట్టుకుపోయిన రోడ్ల కోసం ఇప్పటివరకు నిధులు కేటాయించి ఎందుకు బాగు చేయలేదని ప్రశ్నించారు. మరిపెడ మండలం సీతారాంతండాలో పట్టుమని 25 ఇల్లు కూడా లేవని, అక్కడ మొత్తం మునిగిపోయి వస్తు సామగ్రి అంతా కొట్టుకపోతే సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి పరామర్శించాడే తప్ప ఒక్క రూపాయి సాయం కూడా చేయలేదని విమర్శించారు. వరద బాధితులకు ఆ రోజున బీఆర్ఎస్ నాయకులే అండగా నిలిచారని గుర్తుచేశారు. పేదలకు ఎప్పుడు కష్టం వచ్చినా వారికి అండగా నిలిచేది గులాబీ జెండాయేనని ఇప్పటికైనా కాంగ్రెస్ గుర్తు పెట్టుకోవాలన్నారు. మిర్చి రైతులకు మద్దతు ధర కల్పించే వరకు తమ పోరాటం ఆగదని ఎమ్మెల్సీ స్పష్టంచేశారు.

## కాంగ్రెస్ పాలనలో మా బతుకులు ఆగమైనయ్..

మా పక్షాన ప్రభుత్వంతో కొట్లాడాలని కవితకు ఆటోడ్రైవర్ల వినతి



ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా ఆటోడ్రైవర్ల జేఏసీ నాయకులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 24 : రేవంత్‌రెడ్డి పాలన వచ్చినప్పటి నుంచి మా ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమయ్యాయని మా పక్షాన ప్రభుత్వంతో కొట్లాడి న్యాయం జరిగేలా చూడాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నలమాల సాయి కోరారు. అన్నారు. సోమవారం మహబూబాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను కలిసి ఆటోడ్రైవర్ల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు అని పెట్టి రేవంత్‌రెడ్డి మా డ్రైవర్ల పొట్ట కొట్టాడని, సరైన కిరాయిలు, ఆటో కిస్తీలు కట్టలేక ఇబ్బంది అవుతున్నదన్నారు. గిరాకీలు లేక కుటుంబ గడవక అనేక మంది డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇవన్నీ ప్రభుత్వం చేసిన హత్యలేనని పేర్కొన్నారు. ఇక్కడ జినక సైదులు, అంగోత్ బాలాజీ, రామ్మూర్తి, రవి ఉన్నారు.

## చెప్పలేనంత ఆనందంగా ఉంది..

దంతాలపల్లి, ఫిబ్రవరి 24 : ఉపాధి చూడాలని అడిగిన వెంటనే స్పందించి వరమిచ్చిన నాయకురాలే నా కోసం ఇంటికి చెప్పలేనంత ఆనందంగా ఉంది. మా కుటుంబం మొదటినుంచీ కేసీఆర్ సార్ అభిమానులం. ఉద్యమం నుంచి కేసీఆర్‌తోనే నడుస్తున్నం. కేసీఆర్ అభిమాని కండ్లల్లో ఆనందం చూసేందుకు కవితక్క ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్ కోసం కంప్యూటర్, ప్రింటర్, జిరాక్స్ మిషన్ ఇవ్వడం, ఆమే వచ్చి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. మా కుటుంబం కేసీఆర్ సార్‌కు జీవితాంతం రుణపడి ఉంటది.

– దివ్యాంగుడు చిర్ర సతీశ్, రామానుజపురం



కేసముద్రం మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన ఎర్రబెల్లి దయాకర్‌రావు



కురవి వీరభద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కవిత



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీలు కవిత, తక్కళ్లపల్లి, సత్యవతి, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎంపీ కవిత, శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు



గోదావరి తీరంలో ఆరబోసిన మిర్చి

## దిగుబడి రాక.. ధర లేక
# మిర్చి రైతు విలవిల

**మిర్చికి గిట్టుబాటు ధర లేక..** పంట దిగుబడి రాక రైతు కంట కన్నీరు పెట్టిస్తోంది. గోదావరి పరీవాహక ప్రాంతంలో మిర్చినే నమ్ముకొని నల్లరేగడి భూముల్లో సాగుచేస్తున్న రైతులు ప్రస్తుత ధర, మార్కెట్ మాయాజాలంతో ఆగమయ్యే పరిస్థితి వచ్చింది. గోదావరి, వాగుల తీరాల్లో ఎటుచూసినా ఆరబోసిన మిర్చి దర్శనమిస్తుండగా ప్రస్తుతం ఉన్న ధరతో బెంబేలెత్తుతున్నారు. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లోని గోదావరి నది పరీవాహక ప్రాంతంలో సుమారు 17వేల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నట్లు అధికారుల అంచనా. రైతు ఒక్కో ఎకరం సాగు చేసేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వెచ్చిస్తున్నాడు. పంట చేతికొచ్చే వరకు సర్వం చాకిరీ చేస్తున్న రైతన్న పంట అమ్ముకునే వరకు గ్యారెంటీ లేకుండా పోయింది.

– ఏటూరునాగారం, ఫిబ్రవరి 24

- నల్ల తామర సోకి ఎండుతున్న పంట
- రైతు నెత్తిన అప్పుల భారం
- గోదావరి తీరంలో మిర్చి రైతు గోడు
- కొనుగోలుకు ముందుకు రాని ప్రభుత్వ సంస్థలు
- గోదావరి తీరంలో 17వేల ఎకరాల్లో సాగు

### బోనస్ రాకపోయే మిర్చి నష్టమాయే



రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. ఎకరానికి రూ.2లక్షల వరకు ఖర్చు అయ్యాయి. ఎకరానికి పది క్వింటాళ్లు కూడా దిగుబడి రావడం లేదు. నల్ల తామర తెగులుతో మొక్కలు చనిపోయాయి. దీంతో ఎకరానికి రూ.లక్ష చొప్పున నష్టం వచ్చింది. కనీసం 18 క్వింటాళ్లపైన దిగుబడి వచ్చి రూ.20వేలు ధర ఉంటే బయటపడే అవకాశం ఉంది. ఇదిలా నష్టం జరుగుతుంటే ధాన్యం సాగు చేసి ఈ సంవత్సరం వంద క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే మిల్లర్లు, కేంద్రం వారు కలిసి ఐదు క్వింటాళ్లు తీసేశారు. 95 క్వింటాళ్లు ఇప్పటి వరకు ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ ఇవ్వలేదు. ప్రకటించిన బోనస్ ఇంకెప్పుడు ఇస్తరు. రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారు. ప్రభుత్వం పట్టించుకొని ధర పెంచాలి. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

– సునారికాని భిక్షపతి, ఏటూరునాగారం

ప్రస్తుతం మిర్చి కోతలు పడుతుండగా నల్ల తామర తెగులు(నల్లి వైరస్) సోకి పంట ఎండిపోతున్నది. దీంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా తీరా పంట పండించి మార్కెట్టుకు అమ్ముకునేందుకు వెళితే వ్యాపారుల దోబూచులాటలో రైతు ఓడిపోతున్నాడు. గిట్టుబాటు ధర లభించకున్నా వ్యాపారులు నిర్ణయించిన ధరకు అమ్మాల్సిందే. లేకుంటే అప్పులు ఏడాది పొడవునా కట్టాల్సిందే. ఒక్కో ఎకరానికి 18 నుంచి 25 క్వింటాళ్ల వరకు మిర్చి దిగుబడి వస్తే రైతుకు న్యాయం జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎకరానికి పది నుంచి 15క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మిర్చి రకాన్ని బట్టి ధర ఉండగా క్వింటాకు రూ.12వేలు పలుకుతోంది. ఇక ఎకరానికి సగటున రూ.లక్ష వరకు ఈ సంవత్సరం నష్టం వచ్చేలా ఉందని పలువురు రైతులు వివరిస్తున్నారు. 20 క్వింటాళ్లు పండించిన రైతుకు మాత్రమే పెట్టుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు రైతులు వివరిస్తున్నారు. స్థానికంగా మార్కెట్టు లేకపోవడంతో వరంగల్ మార్కెట్టుకు తరలిస్తున్నారు. పెట్టుబడి రాక చేసిన అప్పులు తీరక చిన్న సన్న కారు రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కన్పిస్తుంది. ఇక కౌలు రైతులకు మరో రూ.30 నుంచి 40వేల వరకు అదనపు భారం పడుతోంది. అయితే వేల ఎకరాల్లో మిర్చి సాగు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేసేందుకు ముందుకు రావు. ఇక కోల్డ్ స్టోరేజీలు స్థానికంగా లేకపోవడంతో వరంగల్ తరలించాల్సిందే. రైతు పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నప్పటికీ కనీసం పట్టించుకునే వారు లేకుండా పోయారు. మిర్చి సాగు చేసే ఉండే ధర పంట చేతికొచ్చే వరకు పడిపోతుండడంతో రైతుకు నిరాశే మిగులుతోంది. కనీసం మిర్చి ధర క్వింటాకు రూ.16 నుంచి వేల వరకు రూ.20వేల వరకు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ధాన్యం తరహాలో మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వ సంస్థలు కొనాలని రైతులు కోరుతున్నారు.

### రూ.2లక్షలకు పైగా నష్టమే



నేను రెండెకరాలు కౌలుకు తీసుకున్నా. ఎకరానికి రూ.35 వేల చొప్పున కౌలు చెల్లించా. 15 ఏండ్ల నుంచి మిర్చి సాగు చేస్తున్నా. గతేడాది కూడా అక్కడికక్కడికే వచ్చింది. ఎకరానికి పది క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుంది. ఇప్పటివరకు రూ.5లక్షలకు పైగా ఖర్చు వచ్చింది. నల్లి తెగులు రావడం దిగుబడి రావడం లేదు. రెండు లక్షలకు పైగా నష్టం వచ్చేట్లు వుంది. కనీసం రూ.18వేలు క్వింటాకు చెల్లిస్తే బయటపడే అవకాశం ఉంది. గత ఏడాది రూ.14వేల వరకు ఉంది. ఇప్పుడు మాత్రం తగ్గింది.

– దాసరి సత్యనారాయణ, ఏటూరునాగారం

## కేసులకు భయపడేది లేదు

- రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- అన్నీ వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, ఫిబ్రవరి 24: రైతులతో పాటు అన్ని వర్గాలు కాంగ్రెస్ పాలనలో అరిగోస పడుతుంటే, వాటిని పరిష్కరించలేని పాలకులు బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతూ జైళ్లకు పంపిస్తున్నారని, కేసులకు భయపడేది లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వ మేనని.. పాలకుర్తి నియోజకవర్గంలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై పెడుతున్న కేసులు ఏ ఒక్కటీ మరిచిపోం.. అన్నీ వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. ఇప్పటికిప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే ఎన్ని సీట్లు వస్తాయనే విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకులు తప్పుడు కేసులు పెట్టి బీఆర్ఎస్ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారని, ఈ పాచిక పారదనే విషయం గ్రహించాలన్నారు. కేసీఆర్ పాలనలో రైతులను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నాడని, కరోనా కష్టకాలాన్ని లెక్క చేయక రైతు భరోసా రైతుల ఖాతాలో వేసిన ఆయన ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. నేడు కాంగ్రెస్ పాలనలో నీళ్లు లేక పొలాలు ఎండు తుంటే, రైతులను ఆదుకునే నాథుడే లేడన్నారు. రుణమాఫీ లేదు, రైతు భరోసాలేదు, రైతు బీమా లేదు, యూరియా బస్తాలు లేవని, దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పాలనానుభవం లేక కొట్టుమిట్టాడుతున్నాడన్నారు. లెక్కకు మించిన అప్పులు తెచ్చినా, ఏ ఒక్క పథకాన్ని అమలుచేయని ఈ సర్కారుపై అన్ని వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయన్నారు. పాలకుర్తిలో ఎండిన పంటలు, రైతుల ఆవేదన చూస్తుంటే బాధేస్తుందన్నారు. తన పర్యటనలో అడుగడుగునా రైతులు సాగునీరు కావాలని మొరపెట్టుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షకార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్, ఎస్సైని నిలదీస్తే వారిపై కేసులు పెట్టిస్తారా, వారేం తప్పు చేశారని ఆయన ప్రశ్నించారు. పోలీసులు కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని, ఈ పద్ధతి మానుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని ఎర్రబెల్లి హెచ్చరించారు. రాష్ట్రంలో మంత్రులకు ఏం మాట్లాడాలో తెలియడంలేదని, ఏ సమయంలోనైనా రేవంత్ సర్కారు కూలవచ్చని జోస్యం చెప్పారు.

### నేడు ఎనుమాముల మార్కెట్‌కు ఎర్రబెల్లి

కాశీబుగ్గ, ఫిబ్రవరి 24 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం సందర్శించనున్నారు. ఉదయం 9గంటలకు మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మిర్చి యార్డుకు వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటారు. మిర్చి ధరలు, మార్కెట్ సమస్యలు, ఇతర మౌలిక సదుపాయాలపై ఆరా తీసి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

## చికెన్ 65.. బాయిల్డ్ ఎగ్స్ ఫ్రీ

వరంగల్‌లో ఓ చికెన్ సెంటర్ బంపర్ ఆఫర్



కరీమాబాద్, ఫిబ్రవరి 24: వరంగల్ 39వ డివిజన్ జన్మభూమి జంక్షన్‌లో ఓ చికెన్ సెంటర్ నిర్వాహకులు సోమవారం చికెన్ 65, ఉడకబెట్టిన కోడిగుడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. అధిక ఉష్ణోగ్రత వద్ద ఉడికించిన తర్వాతే చికెన్, కోడిగుడ్లు తింటాం కాబట్టి ఎలాంటి ప్రమాదం ఉండదని తెలియజేసేందుకే ఫ్రీ మేళా పెట్టామని వారు చెప్పారు. ఆఫర్ విషయం తెలిసిన స్థానికులు బారులు తీరడం కనిపించింది. కార్యక్రమంలో మామిడి రాజు, సిద్ధం రాము పాల్గొన్నారు.